ఎట్టకేలకు ప్రారంభం



సూరారం-ఉడిత్యాల మధ్య దుందుబీ నదిపై బ్రిడ్జి పనులు

- ముమ్మరంగా సూరారం బ్రిడ్జి పనులు
- తీరనున్న పరిసర గ్రామాల ప్రజల రవాణా సమస్య

బాలానగర్: ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న దుందుబీనదిపై నిర్మించే సూరారం బ్రిడ్జి పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. దుందుబీనదిపై రాకపోకలతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రాణాలు కోల్పోయారని, వర్షాకాలంలో నది దాటకుండా పాఠశాలకు సెలవులు ప్రకటించిన సందర్భాలు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. బ్రిడ్జి కోసం గ్రామస్తులు ధర్నాలు చేసి కలెక్టర్‌కు, ఎంపీ, ఎమ్మెల్యేలకు, మంత్రులకు విన్నవించినా ఫలితం లభించలేదు. సూరారం నుంచి మండల కేంద్రానికి రావాలంటే వర్షాకాలంలో 17 కిలోమీటర్లు తిరిగి మోతీఘణాపూర్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే 10 కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి డబుల్ రోడ్డుగా ఉన్న ఉడిత్యాల బీటీ రోడ్డుతో 20 నిమిషాల్లో చేరుకోవచ్చు.

రూ.5కోట్ల నిధులు

మోతీఘణాపూర్, గంగాధారిపల్లి, సూరారం, ఉడిత్యాల మీదుగా మోతీఘణాపూర్ గేట్ నుంచి ఉడిత్యాల వరకు బ్రిడ్జితో పాటు, బీటీ రోడ్డు కోసం 5 కోట్లు మంజూరయ్యాయి. బ్రిడ్జి నిర్మాణంతోపాటు చెక్‌డ్యాం ఏర్పాటుతో గ్రామస్తుల రవాణా సమస్యలకు పరిష్కారం లభించడంతోపాటు చెక్‌డ్యాం నిర్మాణంతో వందలాది మంది రైతులకు సాగునీరు సమస్య కొంతమేర తీరనుంది.

శుభపరిణామం



ఎట్టకేలకు బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డుకోసం నిధులు మంజూరు కావడం శుభపరిణామం. రవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– నర్సింహులు, సర్పంచ్, సూరారం

క్లుప్తంగా

పెన్షనర్ల ఉద్యమానికి టీఎంయూ మద్దతు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల విశ్రాంత ఉద్యోగులకు పీఎఫ్‌పై వస్తున్న కనీస పెన్షన్ పెంపుదల కోసం జాతీయ సంఘర్షణ సమితి చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జి.లక్ష్మణ్‌గౌడ్, జిల్లా నాయకుడు బసప్ప శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15న చేపట్టనున్న రాస్తారోకో కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

మహమ్మదాబాద్: మండలంలోని చాన్నియపల్లిలో అభయాంజనేయ విగ్రహ, నవగ్రహాలు, నాగులు, బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం యాగశాల ప్రవేశం, గణపతి హోమం, కళశపూజ, దేవతామూర్తుల జలాదివాసం, సాయంత్రం శ్రీరామనామ మంత్ర హవనం నిర్వహించారు. ఆదివారం ఉదయం మండపస్థితి, పూజా కార్యక్రమాలు, దేవతా మూర్తుల ధాన్యాదివాసం, శయ్యాదివాసం, భజనలు, 13న సోమవారం యజ్ఞ కార్యక్రమాలు పూర్ణాహుతి, 11గంటలకు హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

గండేడ్: మండలంలోని కొంరెడ్డిపల్లికి చెందిన వెంకటేశ్ భార్య సాయమ్మ శనివారం పురిటి నొప్పులతో బాధపడుతూ 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. 108 అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా, మార్గమధ్యలో నొప్పులు అధికమై ప్రసవమైంది. మగబిడ్డకు జన్మనిచ్చింది. వారిని గండేడ్ ఆస్పత్రికి చేర్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ సాయికుమార్, పైలెట్ ఖుర్షీద్ తెలిపారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శ్రీనివాసకాలనీలోని గీతం హైస్కూల్, లీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శనివారం వివిధ కూడళ్లలో నృత్య ప్రదర్శనలిచ్చారు. సమాజంలో మార్పును తెచ్చేందుకు, చెట్లను నరకవద్దని, మొక్కలకు నీరు పోయాలని, గ్లోబల్ వార్మింగ్‌పై వారు ఇచ్చిన ఈ ప్రదర్శనలు స్థానికులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుధారాణి, ప్రిన్సిపాల్ కృష్ణ, లీడ్ కో–ఆర్డినేటర్ అనిల్ సుంకర తదితరులు పాల్గొన్నారు.

నగర సంకీర్తన



స్టేషన్ మహబూబ్‌నగర్: ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం వైభవంగా గౌరిపూర్ణిమ మహోత్సవం నిర్వహించారు. పద్మావతీకాలనీ శ్రీకృష్ణ కమాన్ నుంచి ప్రారంభమైన నగర సంకీర్తన లక్ష్మీనగర్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మెట్టుగడ్డ, టీచర్స్‌కాలనీ రామాలయం వరకు నిర్వహించారు. అనంతరం రామాలయంలో అభిషేకం, ఇతర పూజలు చేశారు. కలియుగానికి కరుణావతారమైన శ్రీచైతన్య మహా ప్రభువు అవతరించిన రోజు ఫాల్గుణ పూర్ణిమ అని, అందువల్ల గౌరిపూర్ణిమ మహోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం ప్రతినిధులు ఉదయశ్రీ, విమల, రాజమల్లేష్, కొండప్ప, విజయ్‌కుమార్, మల్లారెడ్డి, నక్శల్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం కార్మికుల నిరసన

నవాబుపేట: పంచాయతీ వర్కర్ల వేతనాలు వెంటనే విడదల చేయాలంటూ ఈనెల 13న జిల్లా కేంద్రంలో వంటావార్పు కార్యక్రమంతో నిరసన చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో పంచాయతీ వర్కర్లతో కలిసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 6 నెలలుగా వేతనాలు అందటం లేదని, అలాగే గతంలో పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇస్తామన్న అలవెన్సులు అందటం లేదని ఆరోపించారు. ఈ విషయంలో 13న జరిగే ఆందోళన కార్యక్రమంతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పంచాయతీ వర్కర్లు లక్ష్మయ్య, రమేష్, నర్సింహ, వెంకటేష్, శ్రీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల పట్టివేత

భూత్పూర్: పట్టణంలోని వీధుల్లో తిరిగే కుక్కలను శనివారం సాయంత్రం డాగ్ క్యాచర్‌లు పట్టుకున్నారు. ఇటీవల వీధి కుక్కలు దారిన వెళ్లే వారిపై దాడులు చేస్తుండడంతో మున్సిపల్ అధికారులు పట్టణంలో 2వేల కుక్కలను గుర్తించారు. కర్నూల్‌కు చెందిన డాగ్ క్యాచర్లను రప్పించి శనివారం 50 కుక్కలను పట్టుకొని అచ్చంపేట అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నారు. కుక్కల పట్టివేతను మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, నాయకులు నారాయణ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ రాములు తదితరులు పర్యవేక్షించారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి

అడ్డాకుల: సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని భూత్పూర్ సీఐ రజితారెడ్డి అన్నారు. మూసాపేట మండలం పోలకంపల్లిలో శనివారం రాత్రి గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయొద్దని సూచించారు. ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేసుకోవద్దని తెలిపారు. మహిళల పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే తమ దృష్టికి తేవాలని అన్నారు. అనవసరమైన వివాదాల్లో తలదూర్చవద్దని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో మూసాపేట, భూత్పూర్ ఎస్‌ఐలు నరేష్, భాస్కర్ రెడ్డి, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు నూతన ఆవిష్కరణ దిశగా ఎదగాలి



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు యూనివర్సిటీలోని ఎంబీఏ ఆడిటోరియం అకాడమిక్ బ్లాక్‌లో శనివారం బిజినెస్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో 2014–2022 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ కిశోర్‌లు మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణ దిశగా ఎదగాలన్నారు. ఈ మేరకు అంబేద్కర్ రాసిన తీసిస్‌ను గుర్తు చేశారు. అనంతరం హెచ్‌ఓడీ అర్జున్ కుమార్ మాట్లాడుతూ సమాజ నిర్మాతలుగా ఎదిగి మరో పదిమందికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీసీ లక్ష్మీ కాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు, జావేద్ మహమ్మద్, డాక్టర్ అరుంధతి రెడ్డి, నాగసుధ, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న రాములు

జడ్చర్ల టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిందేనని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రాములు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ భవనంలో సీఐటీయూ, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ, కార్మిక, కర్షక విధానాలను తుంగలో తొక్కేస్తూ ప్రజా మధ్య తరగతి సమస్యలను పక్కకు నెట్టేసి కులం, మతం పేర్లతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి సమస్యలను నీరుగారుస్తుందన్నారు. ఈ విధానాలను ఎండగట్టాల్సిందేనన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడుతూ ఏప్రిల్ 5న లక్షలాది మందితో ఢిల్లీలో జరిగే చలో పార్లమెంట్ ముట్టడి విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, నాయకులు ఆండాలు, సాయిలు, మున్నా, రామచంద్రమ్మ, బాలనాగయ్య పాల్గొన్నారు.

మహిళకు పోలీసుల రక్షణ



జడ్చర్ల: జడ్చర్ల శివారులో ఓ దాబా వద్ద ఆగిన ట్రావెల్ బస్సులో వెళ్తున్న ఓ ప్రయాణికురాలు మూత్ర విసర్జనకు దిగింది. గమనించని డ్రైవర్ అలాగే వదిలేసి వెళ్లిపోయాడు. పోలీసులు వివరాలు సేకరించి ఓ మహిళా హాస్టల్‌లో ఉంచి మరుసటి రోజు బంధువులకు అప్పగించిన సంఘటన జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రేణిగుంటకు చెందిన పోపూరి రాణి తన కుమారుడు సందీప్‌తో కలిసి శుక్రవారం రాత్రి ఓ ట్రావెల్ బస్సులో హైదరాబాద్ నుంచి తిరుపతికి బయలుదేరారు. జడ్చర్ల సమీపంలో మునావర్ దాబా వద్ద టీ బ్రేక్ కోసం బస్సును నిలిపిన సమయంలో రాణి బస్సు దిగింది. బస్సులో నిద్రిస్తున్న కుమారుడు సందీప్‌కు చెప్పకుండా బస్సు దిగడంతో గుర్తించలేదు. ఆమె ఎక్కకుండానే బస్సు బయలుదేరింది. 44వ నంబర్ జాతీయ రహదారిపైకి చేరుకుని తనను విడిచి వెళ్లిన బస్సును చేరుకునేందుకు లారీలను ఆపుతుండగా, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆమెను విచారించి ఓ లేడీస్ హాస్టల్‌లో ఉంచి కుమారుడికి ఫోన్ చేసి చెప్పారు. అప్పటికే బస్సు కడప దాటి వెళ్లిపోయింది. సందీప్ హైదరాబాద్‌లోని బంధువులకు సమాచారం ఇవ్వడంతో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా, పోలీసులు వివరాలు తెలుసుకొని రాణిని వారికి అప్పగించారు. పోలీసులకు బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాలానగర్: మండలంలోని కేతిరెడ్డిపల్లి గాలిగూడకు చెందిన బీఆర్‌ఎస్ నాయకురాలు బాలమ్మ ఇటీవల మృతిచెందింది. విషయం తెలిసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పార్టీ నాయకులతో శనివారం ఉదయం రూ.10వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నరసింహ, లాలు, కృష్ణ, సుధాకర్, రాజు, సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం



గంధం ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లిలో అబ్దుల్ రహమాన్ (మాసన్న) ఉర్సు ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని దర్గా నిర్వాహకుల ఇంటి వద్ద నుంచి గంధం ఊరేగింపుగా మేళతాళాల మధ్య భక్తుల ప్రత్యేక పూజల మధ్య దర్గా షరీఫ్‌కు సమర్పించారు. కార్యక్రమంలో తాండూర్ ఖరీంషా దర్గా పీఠాధిపతి సాబేర్ పాషా, దుప్పల్లి అబ్దుల్ రహీం ఉర్సు ఖలందరి రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


పెల్లుబికిన నిరసనలు



జిల్లా కేంద్రంలో సీఐకి ఫిర్యాదు చేస్తున్న మహిళలు

మహబూబ్‌నగర్ క్రైం/జడ్చర్ల/దేవరకద్ర: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

- జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ మహిళా ప్రజాప్రతినిధులు టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు.
- బండి సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జడ్చర్ల సీఐ రమేశ్‌బాబుకు జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్లు జ్యోతి, చైతన్య, దేవ తదితరులు ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు.
- దేవరకద్రలో ఎమ్మెల్సీ కవితపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు బీఆర్‌ఎస్ శ్రేణులు భగ్గుమన్నారు. స్థానిక పాత బస్టాండ్ రోడ్డుపై బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు.
- రాజాపూర్లో బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూత్పూర్ పట్టణంలోని చౌరస్తాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నవాబుపేటలో మహిళ నాయకురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలానగర్లో బండి సంజయ్ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేసి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హన్వాడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై టీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం మిడ్జిల్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్‌కు ఫిర్యాదు చేశారు.



జడ్చర్లలో నిరసన తెలుపుతున్న నాయకులు



దేవరకద్రలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



నంచర్లగేట్‌లో..

పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నారాయణగౌడ్, జి.రఘురాంరెడ్డి కోరారు. ప్రచారంలో భాగంగా శనివారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలోనే కొత్త పీఆర్‌సీ ఏర్పాటుకు, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పూర్తి చేయిస్తామన్నారు. ముఖ్యంగా పండిత్, పీఈటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వి.గోపాల్ నాయక్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని మండల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని సల్కర్‌పేట్, రెడ్డిపల్లి, గండేడ్, కొంరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణయ్య, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

విచక్షణతో ఆలోచించి ఓటు వేయాలి



మాట్లాడుతున్న బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: బీసీటీఏ, ఎస్‌ఎల్‌టీఏ, బహుజన సంఘాల అభ్యర్థి విజయ్‌కుమార్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాసనమండలి ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే సామాజికవర్గం వారే గెలిచారని, ఇందులో బహుజనులవి 90శాతం ఓట్లు ఉన్నాయన్నారు. విద్యారంగ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న తమ అభ్యర్థికి ఏ పార్టీతో సంబంధం లేదన్నారు. ఈ ఎన్నికల్లో మేధావులందరూ విచక్షణతో ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశంలో బీసీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా అధ్యక్షుడు సురేంద్రనాథ్, నాయకులు వినోద్, ప్రసన్నకుమార్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేసే వారినే గెలిపించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: కాటేపల్లి జనార్దన్‌రెడ్డి తన పదవీకాలంలో అధ్యాపక, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారని తెలంగాణ ఆల్‌మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 317 జీఓలో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేసే సత్తా కేవలం కాటేపల్లికి ఉందని పేర్కొన్నారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా నిశబ్ద ఓటింగ్‌తో మెజార్టీ ఓట్లు సాధించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా కాటేపల్లి జనార్దన్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని తెలిపారు.

పీహెచ్‌సీ నాణ్యతా ప్రమాణాలపై ఆరా



రోగులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

అడ్డాకుల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జాతీయ నాణ్యతా ప్రమాణాల కమిటీ బృందం సందర్శించింది. కమిటీ సభ్యులు డాక్టర్ సుదీప్ దత్త, డాక్టర్ వి.సుగుణలు సందర్శించి ఆస్పత్రిలో పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ల రికార్డులు, సాధారణ పరిపాలన విభాగం రికార్డులను పరిశీలించి స్థానిక సిబ్బందితో మాట్లాడారు. కాన్పుల గది, ల్యాబ్, ఫార్మసీ గదులను పరిశీలించి అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆస్పత్రి ఆవరణలో ఉన్న అంబులెన్స్‌ను పరిశీలించి సేవల గురించి ఆరా తీశారు. రికార్డులు, రిపోర్టుల నిర్వహణను మెరుగు పర్చుకోవాలని బృందం సూచించింది. కార్యక్రమంలో డాక్టర్ అపర్ణ, రాజాచంద్ర, గౌతంరెడ్డి, కిరణ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



భూత్పూర్‌లో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

భూత్పూర్: పట్టణంలోని న్యూ ఎర ఉన్నత పాఠశాలలో శనివారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. 54మంది పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు చెప్పారు. డీఈఓగా ఐశ్వర్య, ఎంఈఓగా కార్తీక్‌రెడ్డి, కరస్పాండెంట్‌గా ఇర్ఫాన్, హెచ్‌ఎంగా హేమంత్‌రెడ్డితో పాటు 50మంది విద్యార్థులు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ క్రాంతికుమార్, హెచ్‌ఎం భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



హన్వాడలో..

హన్వాడ: మండల కేంద్రంలోని ది ఎవరెస్ట్ టాలెంట్ స్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజేందర్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, వెంకటయ్య, బాల్‌రాజు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు పరిశీలన

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో సీసీరోడ్డు, డ్రెయినేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి పరిశీలించారు. ఓపెన్‌డ్రైన్ నిర్మాణం పూర్తిచేసి సీసీ వేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేయాలన్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని తెలిపారు. ఆమె వెంట కౌన్సిలర్ శశికిరణ్ ఉన్నారు.